అమ్మవారిశాల వెనక వైపు



వైసీపీ చెత్త రాజకీయం

ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు దాటింది. ఘోర పరాజయాన్ని సహించ లేని వైసీపీ ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కాసుక్కూర్చుని ఉంది. చిన్న అవకాశం దొరికితే టీడీపీపై ఆరోపణలు చేసేందుకు రెడీగా ఉంది. అయితే ఇప్పుడు కార్పొరేషన్‌లో చెత్తను వైసీపీ పాలకవర్గం రాజకీయంగా వాడుకుంటోంది. చెత్త శుభ్రం చేయకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్ల మీద కుప్పలు కుప్పలుగా పెట్టేసి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నాలు చేస్తూ.. చెత్త రాజకీయానికి తెర లేపింది.



గాజులవీధిలో పేరుకుపోయిన చెత్త

- కార్పొరేషన్‌లో చెత్తసేకరణ వాహనాలను తగ్గించిన వైనం
- పేరుకుపోతున్న చెత్త
- ప్రభుత్వంపై నెపం నెట్టే యత్నం
- ఆస్తి పన్నులోనే చెత్త పన్ను కూడా కలిపి వసూళ్లు
- జగన్ పాలనలో జనం నుంచి నెలనెలా చెత్తకు ప్రత్యేక పన్ను
- చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నిలిచిన వసూళ్లు
- ఆర్థిక భారం కార్పొరేషన్‌పై పడకుండా.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే యత్నం



చాంద్‌పీర్ దర్గా పక్కవీధిలో పేరుకుపోయిన చెత్త

(కడప-ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌కు నగర పౌరుడు ఆస్తి పన్ను చెల్లిస్తుంటారు. అందులోనే చెత్త, డ్రైనేజీ, గ్రంథాలయ సెస్‌లను, ఇతర పన్నులు కలుపుకుని వసూలు చేస్తుంటారు. సపరేట్‌గా నీటి పన్ను చెల్లిస్తుంటారు. అంటే కార్పొరేషన్ ప్రజలకు చేసే అన్ని సేవలకు పన్ను వసూలు చేస్తుంటారు. అంటే మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కార్పొరేషన్ పైన ఉంటుంది. అయితే జగన్‌పాలనలో చెత్త పేరిట నెల నెలా పన్ను వసూలు చేశారు. ఇది తీవ్ర దుమారం రేపినా డోంట్ కేర్ అంటూ ముందుకు సాగారు. కూటమి ప్రభుత్వం వస్తే చెత్త పన్ను నిలిపివేస్తామని చంద్రబాబుతో పాటు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జూన్ నుంచి చెత్త పన్ను నిలిచిపోయింది. పన్ను వసూలు చేయవద్దంటూ మౌఖిక ఆదేశాలు వచ్చాయి. దీంతో వసూలు చేయడం లేదు. కేవలం కమర్షియల్‌కు సంబంధించినవి మాత్రమే పన్నులు వసూలు చేస్తున్నారు.

'చెత్త' రాజకీయం

కడప కార్పొరేషన్ వైసీపీ పాలకవర్గం చేతుల్లో ఉంది. 50 మంది కార్పొరేటర్లు ఉంటే.. టీడీపీకి ఒకే ఒక కార్పొరేటరు ఉన్నారు. జగన్ హయాంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు వంద ఆటోలను తీసుకున్నారు. ఇవి అప్పటి వైసీపీ ముఖ్య నేతల అనుచరులవి అని చెబుతారు. ఒక్కో ఆటోకు నెలకు రూ.63వేలు చెల్లించేవారు. అంటే వంద ఆటోలకు 63 వేలు వంతున నెలకు రూ.63 లక్షలు చెల్లించారు. ఇంటింటి నుంచి, కమర్షియల్ ద్వారా నెలకు రూ.45లక్షలు వసూలు అయ్యేది. అంటే దాదాపు రూ.20 లక్షల మేర కార్పొరేషన్ నిధులను చెత్త ఆటోలకు చెల్లిస్తూ వచ్చారు. ఆటోలు వైసీపీ ముఖ్య నేతల అనుచరులవి కావడంతో కార్పొరేషన్ ఖజానా నుంచి చెల్లింపులు జరుగుతూ వచ్చేవి. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటి నుంచి చెత్త పన్నుల వసూళ్లు నిలిచిపోయాయి. హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర వాణిజ్యలకు సంబంధించి సుమారు రూ.10లక్షలకు పైగా వసూలు అవుతుంది.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే యత్నం

కూటమి ప్రభుత్వం వచ్చాక కార్పొరేషన్‌లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్త సేకరణ సరిగా లేదంటూ.. ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టేందుకు పాలకవర్గంలోని ముఖ్యనేత, మరికొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కమిషనరుగా ప్రవీణ్‌చంద్ పనిచేసినప్పుడు ఆయన పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఎక్కడా చెత్త లేకుండా విజిట్ చేసి అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. ఆయన బదిలీపై వెళ్లిపోయారు. ఆ తరువాత పారిశుధ్యంపై పర్యవేక్షణ కరువైంది. ప్రస్తుతం చెత్త సేకరణకు 90 ఆటోలను వినియోగిస్తున్నారు. వీటిలో 70 ఆటోలు ఒక ఏజన్సీవి కాగా, మరో 20 ఆటోలు వేరే ఏజన్సీవి. అయితే ఇప్పుడు కేవలం 70 ఆటోలు మాత్రమే చెత్త సేకరణకు తిరుగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలన్న ఉద్దేశ్యంతో పారిశుధ్యంపై దృష్టి సారించడం లేదని చెబుతున్నారు. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి.. వర్షం వస్తే ఆ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతాయి. దీంతో వ్యాధులకు కేరాఫ్‌గా మారుతుంది. మా హయాంలో చెత్త సేకరణ బాగా చేసి పారిశుధ్యం నీట్‌గా ఉంచాం, కూటమి ప్రభుత్వం పారిశుధ్యం భ్రష్టు పట్టించిందని టీడీపీపై నెపం వేసేందుకు వైసీపీ పాలకవర్గం ప్లాన్డ్‌గా పారిశుధ్యానికి సంబంధించి వాహనాలను తగ్గించినట్లు చెబుతున్నారు. జనం నుంచి చెత్త పన్ను వసూ లు నిలిచిపోవడంతో కమర్షియల్ ద్వారా రూ.10 లక్షల నుంచి 15 లక్షలు మాత్రమే వస్తుం ది. ఒక్కో ఆటోకు నెలకు రూ.63వేలు చెల్లించాల్సి ఉంది. అయితే జనం నుంచి వసూలు కాకపోవడంతో ఈ సొమ్మును కార్పొరేషన్ నుంచి చెల్లించాల్సి ఉంది. అయితే పాలకవర్గం నేతలు వారి సొంత జేబులో నుంచి డబ్బులు ఇచ్చినట్లు బిల్డప్ ఇస్తూ ఉద్దేశ్యపూర్వకంగానే వాహనాలు తగ్గించారని చెబుతున్నారు.

ఎమ్మెల్యేను అడగండి..

చెత్త సేకరణకు సంబంధించి వాహనాలకు కార్పొరేషన్ నిధులు చెల్లించాలని అధికారులు పాలకవర్గం నేత వద్ద ప్రస్తావించగా.. మనమెందుకు చెల్లిస్తాం, చెత్త పన్ను వద్దని చెప్పిం ది ప్రభుత్వం.. ఆ డబ్బులేవో ఎమ్మెల్యేను అడగండంటూ ఆ నేత అధికారి వద్ద వ్యాఖ్యానించడం చూసి అధికారులు ఆశ్చర్యపోయినట్లు చెబుతారు. కార్పొరేషన్ ఆవిర్భవించిన తరువాత కాంగ్రెస్, వైసీపీ చేతుల్లోనే ఉంది. 2014-19 టీడీపీ హయాంలో రిక్షాల ద్వారా చెత్త సేకరించేవారు. అప్పట్లో ఇంటికి రూ.20, 30 ఇచ్చేవారు. ఒక చోట చేర్చిన చెత్తను వాహనాల ద్వారా బయటి ప్రాంతాలకు తీసుకెళ్లేవారు. కార్పొరేషన్ ఆవిర్భవించాక ప్రస్తుత వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి మేయర్‌గా పనిచేశారు. ఆయన హయాంలో కూడా పారిశుధ్యం గురించి ఎలాంటి వివాదాలు తలెత్తలేదు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడం.. టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో చెత్త రాజకీయానికి వైసీపీ పాలకవర్గం తెర లేపిందంటున్నారు. ప్రతి ఏటా చెల్లించే ఆస్తిపన్నులోనే అన్ని పన్నులు కలిపి వసూలు చేస్తారని.. మళ్లీ చెత్తకు పన్ను ఏంటంటూ పలువురు ప్రశ్నిస్తూనే ఉన్నప్పటికీ పాలకవర్గం పట్టించుకోవడం లేదు.

ఎమ్మెల్యేపై బాధ్యత

కడపలో వైసీపీ వ్యూహాత్మకంగా చెత్తపై రాజకీయం చేస్తుంది. కమిషనరుగా పనిచేసిన ప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు పారిశుధ్యం బాగుండేది. ఆయన బదిలీ అయిన తరువాత గాడి తప్పింది. పాలకవర్గం వైసీపీ ఉన్నప్పటికీ ఆ నెపం మాత్రం అధికార పార్టీపైనే వేస్తారు. జనం కూడా రోడ్లు బాగాలేవన్నా, చెత్త తీయకపోయినా, తాగునీరు అందకపోయినా పాలకవర్గాన్ని పట్టించుకోరు. ప్రభుత్వాన్ని చూస్తారు. ఎమ్మెల్యే మాధవీ కడప నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కార్పొరేషన్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలి. లోటుపాట్లపై చర్చించాలి. నిధులు అవసరమైతే ప్రభుత్వం నుంచి తీసుకురావాలి. పారిశుధ్యంపై మార్నింగ్‌వాక్ లాంటి ఆకస్మిక తనిఖీలు చేయాలి. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది కాబట్టి.. ప్రతి అంశాన్ని టీడీపీ వైఫల్యంగా అంటకట్టే ప్రయత్నం చేస్తారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి. ఎందుకంటే జనం చాలా విజ్ఞులు. అదను చూసి వాత పెడతారు. కనుక పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ఈ విషయమై ఆంధ్రజ్యోతితో ఎంహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ చెత్త సేకరణకు రోజూ 90 ఆటోలను వినియోగించేవారం. అయితే ఒక ఏజన్సీ తన 20 ఆటోలను నిలిపివేసింది. దీంతో 70 ఆటోలతోనే చెత్తసేకరణ జరుగుతుందని తెలిపారు. నగరాన్ని 17 క్లస్టర్లగా విభజించాం. ఎక్కడా కానీ చెత్త లేకుండా చేస్తాం.

కలమల్లలో తెలుగుభాషా దినోత్సవం

- ఈ తరానికి గుర్తుండి పోయేలా నిర్వహిస్తాం..

ఎర్రగుంట్ల/కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25: తెలుగుభాష ఈతరానికి గుర్తుండిపోయేలా తొలి తెలుగుశాసనం లభ్యమైన కలమల్లలో ఆగస్టు 29న తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తొలి తెలుగు శాసనం లభ్యమైన ఎర్రగుంట్ల మండలంలోని కలమల్ల వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలను పరిశీలించారు. ఇక్కడ తొలి తెలుగు శాసనం లభ్యమైనట్టుగా చరిత్ర చెబు తున్న దృష్ట్యా దేవదాయ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఇంటాక్ తదితర అధికారులతో కలిసి ఆయన ఆప్రాంతంలో కలియ తిరిగారు. తొలి తెలుగు శాసనాలను, లిపిని కలెక్టర్‌కు అధికారులు చూపించారు. కడపలో తెలుగుభాషకు సేవచేసిన వేమన, అన్నమయ్య, తరిగొండ వెంగమాంబ, సుమతి శతకాల రచయిత బద్దెన, కుమారసంభవం రాసిన నన్నెచోళుడులను గుర్తు చేసుకునే విధంగా సాంస్కృతిక కార్యక్రమాల సంబరాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. శ్రీకృష్ణదేవ రాయులుకు సంబంధించిన నాటికను కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా ప్రముఖ తెలుగు వక్తలు ప్రసం గాలు ఉంటాయన్నారు. పిల్లలకు తెలుగుభాషపై జూనియర్స్ సీనియర్స్ విభాగంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి.. బహుమతులు అందజే స్తామన్నారు. జిల్లాలో ఇటీవల తెలుగుభాషలో మంచి పుస్తకాలు రచించి పేరొందిన ఐదుగురు ప్రముఖ రచయితలను సన్మానించనున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో అనురాధ, తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, దేవదాయశాఖ ఈవో జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్యామసుందర్‌రాజు, తాళపత్ర గ్రంథ లిపి నిపుణులు నాగదాసరి మునికుమార్, కార్యదర్శి సాంబశివారెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

తెలుగుభాష దినోత్సవం నిర్వహణకు సంబంధించి కలెక్టర్ లోతేటి శివశంకర్ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో ప్రధానోపాధ్యాయురాలు మేరి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు, సహాధ్యక్షుడు రవికుమార్, బాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, ఆర్ట్ కళాశాల అధ్యాపకులు హజరతయ్య, ఇంటాక్ జిల్లా కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి తదితరులను నియమించారు. కార్యక్రమంలో డీఈవో అనురాధ, ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఆర్వో వేణుగోపాలరెడ్డి, కె.చిన్నపరెడ్డి, మునికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



శిలాశాసనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్

కొండాపురం, ఆగస్టు 25: ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ఏటూరు ఇసుకరీచ్‌ను, ఇసుక స్టాక్‌పాయింట్‌లను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఏటూరు, పి.అనంతపురం గ్రామాల వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ల నుంచి ఇసుకను సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొన్ని రోజుల్లో ఏటూరు ఇసుకరీచ్‌కు గండికోట బ్యాక్‌వాటర్ వచ్చే అవకాశం ఉన్నందున ఇసుకను స్టాక్‌పాయింట్‌కు త్వరతగతిన చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఇసుక రీచ్‌తో పాటు సచివాలయాల వద్ద ఇసుక రవాణాకు సంబంధించిన వివరాలను ఉంచాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద టెంట్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఇసుక రవాణా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఇసుకస్టాక్ పాయింట్‌లను, ఇసుకరీచ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు శివనారాయణరెడ్డి, అధికారులు, కూటమి నాయకులు లావనూరు నారాయణరెడ్డి, గండ్లూరు శంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రామసుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏటూరు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

మాదిగల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సదస్సులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 25: మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులుమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రాష్ట్రాలకు అధికారం ఇవ్వడాన్ని అభినందిస్తూ అందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్రమంలోనే వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంతవరకు ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతేగాక గత ప్రభుత్వం ఎస్సీల పట్ల అనుచితంగా వ్యవహరించి సుమారు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఎస్సీల అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ అడ్డంకులను తొలగించి గత ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలను అమలు పరచాలని ముఖ్యమంత్రికి తెలియచేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలుగకుండా ఎమ్మార్పీఎస్‌కు కేటాయించిన ఉద్యోగాలు మాదిగలకు దక్కేటట్లు చర్యలు చేపడతామన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రాబోవు రోజుల్లో రాయచోటి పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నా వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, జిల్లా నాయకులు ఆంజనేయులు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, మాజీ సెక్రటరీ రాజా, న్యాయవాదుల అధ్యక్షుడు వెంకట్రమణ, ఉద్యోగ విభాగం నాయకులు ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు సుబ్బయ్య, చిన్నమండెం నాయకుడు లక్ష్మయ్య, రమణ, వీరబల్లి నాయకులు శివ, రాంమోహన్, బాలరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

చౌడూరు టు చాగలమర్రి

- పట్టపగలే ఇసుక అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న పోలీసులు
- టీడీపీ గ్రామ నాయకులు సాగిస్తున్న దందా



చౌడూరు నుంచి పర్లపాడుమీదుగా చాగలమర్రి కి అక్రమ రవాణ చేస్తున్న ఇసుక

ప్రొద్దుటూరు, ఆగస్టు 25 : పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ప్రతి రోజు ట్రాక్టర్లలో ఇసుకను జిల్లాలు దాటిస్తూ అక్రమ రవాణా సాగిస్తున్నారు. ట్రాక్టర్ చెక్కులోడు ఇసుక రూ.10వేలకు పైగా చాగలమర్రి ఆళ్లగడ్డలలో అమ్ముకుంటున్నారు. దీంతో రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను జిల్లా దాటిస్తే లక్షల్లో ఆదాయం వస్తుందని అక్రమ రవాణా దారులు బరితెగిస్తున్నారు. ఇందులో పోలీసులకు ట్రాక్టరుకు ఇంత మామూలు పెట్టుకోవడంతో వారు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి.

వైసీపీ కంటే.. మేము తక్కువ తిన్నామా..

నిన్నటి వరకు వైసీపీ ప్రభుత్వంలో టిప్పర్లు, ట్రాక్టర్లతో పెన్నానదిని కొల్లగొట్టి కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు ఇసుకను అక్రమంగా తరలించి రూ.కోట్లు గడించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చింది. మేము వైసీపీ వాళ్ల కంటే తక్కువ తిన్నామా అంటూ కొందరూ టీడీపీలోని గ్రామస్థాయి నేతలు ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ఇదే అదునుగా కొందరు వైసీపీకి చెందిన వారు కూడా ఇసుక రవాణా సాగిస్తున్నారు. దీంతో పెన్నా నది నుంచి ప్రతి రోజు చౌడూరు నుంచి కాకిరేనిపల్లె, పర్లపాడు మీదుగా ఇసుక ట్రాక్టర్లు చాగలమర్రికి వెళుతున్నాయి.

అడపా దడపా పోలీసు దాడులు

ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో ఇటీవలే డీఎస్పీతో సహా సీఐలు, ఎస్ఐలు కొత్తగా వచ్చారు. కానీ కానిస్టేబుళ్లు మాత్రం ఇంకా పాత వాళ్లే కొనసాగుతున్నారు. రూరల్ స్టేషన్ పరిధిలో కొత్తగా వచ్చిన పోలీసు అధికారులు అడపాదడపా ఫిర్యాదులు రావడంతో ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు 7 ఇసుక ట్రాక్ట ర్లను పట్టుకున్నారు.

కానీ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పెన్నా నది ప్రవహిస్తోంది. దీంతో పెన్నా నది తీరం వెంబడి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ముఖ్యంగా చౌడూరు నుంచి రంగసాయిపురం శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, నరసింహాపురం, రామాపురం, కొత్తపేట, దొరసానిపల్లె, రామేశ్వరం, పెన్నానగర్, నంగనూరుపల్లె, కల్లూరు, రేగళ్లపల్లె, తాళ్లమాపురం గ్రామాల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

ఉక్కుపాదం మోపుతారా...

కొత్తగా వచ్చిన డీఎస్పీ భక్తవత్సలం ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతారా లేదా అడపాదడపా దాడులతో సరిపుచ్చుతారా అని పర్యావరణ కార్యకర్తలు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా మండల పరిధిలోని పెన్నానదిలో ఎక్కడ ఇసుక తవ్వకాలు జరిపి అక్రమ రవాణాకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు న్నారు. ఇసుక అక్రమ రవాణాకు వినియోగిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్

- రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు స్వాధీనం

కడప (క్రైం), ఆగస్టు 25: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పలు పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధి ఎర్రముక్కపల్లెలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి రికార్డులు లేని 21 మోటారు సైకిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. కడప టూటౌన్ పరిధి మాసాపేట, గౌస్‌నగర్‌లలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, రౌడీషీటర్లకు ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ చేశారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో అమృతానగర్‌లో రికార్డులు లేని 42 ద్విచక్ర వాహనాలు, 3కార్లు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు సబ్‌డివిజను పరిధిలో ఇందిరమ్మ కాలనీలో కార్డన్ అండ్‌సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 14 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడుగు పరిధి టి.కోడూరులో పలువురు ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు.

స్టాకు యార్డు వద్ద టోకను పాయింట్



- నిలిచిన అదనపు వసూళ్లు

ఆంధ్రజ్యోతి స్పందన

(కడప-ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల రెవెన్యూ గ్రామపరిధిలోని ఎర్రబల్లె పంచాయతీలో ఉన్న ఇసుక స్టాకు పాయింట్ వద్ద ఆదివారం లారీ, టిప్పర్లకు అదనంగా వసూలు చేస్తున్న రూ.3వేలకు బ్రేక్ పడింది. ఆంధ్రజ్యోతిలో 'కప్పం కడితే చాలు కావాల్సినంత తోలుకోవచ్చు' అనే కథనం ఆదివారం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ శివశంకర్ సీరియస్ అయ్యారు. దీంతో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర రెవెన్యూ సిబ్బంది స్టాకుయార్డు తనిఖీ చేశారు. వీఆర్వో ఇతర సిబ్బంది అంతా అక్కడే ఉన్నారు. నిన్నటి వరకు మాన్యువల్ ద్వారా టోకన్లు రాసేవారు. అయితే ఆదివారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌లో బుక్ చేసుకున్నారు. సంఘమేశ్వరాలయంలో ఉన్న టోకను పాయింటును యార్డు సమీపంలోకి మార్చారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారమే టన్నుకు రూ.340 చెల్లించి తీసకువెళతున్నామని.. అదనంగా డబ్బులు ఇవ్వడం లేదని ఓ అధికారి రాసుకొచ్చిన పేపరుపై లారీ, టిప్పరు డ్రైవర్లతో సంతకాలు చేయించడం గమనార్హం. అదనపు వసూళ్లు నిలచిపోవడంతో థ్యాంక్స్ టు ఆంధ్రజ్యోతి అంటూ కొందరు లారీ, టిప్పరు డ్రైవర్లు వ్యాఖ్యానించారు.

పరిశీలిస్తున్న అధికారులు



వైభవంగా వద్దిబోయినవారి వివాహ రిసెప్షన్ వేడుక



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బద్వేలుటౌన్, ఆగస్టు 25: ప్రముఖ స్పెషల్‌క్లాస్ కాంట్రాక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతుల ఏకైక కుమార్తె డాక్టర్ సాయినవ్య, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం ఆర్‌ఆర్ కన్వెన్షన్ కల్యాణమండపంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ రాజకీయ నేతలు ప్రజలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మల్లెల లింగారెడ్డి, విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, వద్దిబోయిన సాయికిరణ్ రెడ్డి, పాల మల్లికార్జునరెడ్డి, గోపవరం జడ్పీటీసీ జయరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ఏసీఎస్ డిజిటల్ నెట్‌వర్క్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణాయాదవ్, మాజీ ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నేతలు కొండయ్య, రామానాయుడు, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి, వివేకానందరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామక్రిష్టారెడ్డి, దేవరాజు, సమ్మెట అబ్రహాం, బిజయ్య తదితరులు 5వేల మందికిపైగా పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కాశినాయన ఆగస్టు 25: సావిశెట్టిపల్లె రెవెన్యూ పొలంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 9 ఎకరాల్లో అరటి తోట కాలిపోయినట్లు బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు నల్లేరుకొట్టాలకు చెందిన రైతులు లెక్కల బాలసుబ్బారెడ్డి 5ఎకరాలు, రాజేశ్వరి 4 ఎకరాల్లో అరటి సాగు చేశారు. ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో తోటలో మంటలు చెలరేగాయి. గుర్తించి రైతులు పోరుమామిళ్ళ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు మంటలను ఆర్పారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని రైతుల వాపోయారు.

స్టెప్స్‌తో అదరగొట్టిన చిన్నారులు



కడప (కల్చరల్) ఆగస్టు 25: కడప నగర చిన్నారులు ఆదివారం నగర రిమ్స్ సమీప శిల్పారామంలో వివిధ సినిమా, జానపద, శాస్త్రీయ, దేశభక్తి పాటలకు వేసిన స్టెప్స్ ప్రేక్షకులను అలరించాయి. ఆట విడుపులో భాగంగా అక్కడి సాంస్కృతిక కళావేదికపై పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో మిస్సా మూవీ సహకారంతో అఖిల్ అకాడమీ చిన్నారులు వేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో చీమ దసరా చిన్నోడు, చినుకు చినుకు అందెలతో అనే పాటలు ఆకట్టుకున్నాయి.

ఏపీ ఎంఆర్‌టీ చెస్ విజేతగా జశ్వంత్

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 25: అశ్రఫ్ ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ (ఏపీఎంఆర్‌టీ) చెస్ విజేతగా నూకల జశ్వంత్ నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప పాలెంపాపయ్య వీధిలోని అనీస్ దర్బారీ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ద్వితీయ విజేతగా జతిన్‌కుమార్, తృతీయ విజేత గా ప్రభుదేవా నిలిచినట్లు జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ వెల్లడించారు. ఇందులో జిల్లా నలుమూలల నుంచి సుమారు 50 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కాగా విజేతలకు బహుమతులను అనీస్‌దర్బారీ, అందజేశారు.

మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయ స్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.


కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకుచివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

గుర్తు తెలియని వాహనం ఢీ - వ్యక్తి మృతి

చెన్నూరు, ఆగస్టు 25: రాజంపేట బైపాస్‌రోడ్డులో బచ్చుంపల్లె వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నవాజ్ (27) మృతి చెందాడు. వల్లూరు మండలం మిట్టపల్లెకు చెందిన నవాజ్ కడప నగరం చిన్నచౌకు పరిధిలో చిన్న కొట్టు ఏర్పాటు చేసుకుని రోజూ కడపకు వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కడపకు వచ్చిన ఆయన తిరిగి రాత్రి వెళుతుండగా బచ్చుంపల్లె సమీపంలో ఆయన వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అంతలోనే అతడు మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ప్రజా దర్బార్ ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 25: ప్రజా దర్బార్ ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రాయచోటి ప్రాంతంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా దర్బార్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు మీద ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఎర్రగుంట్ల, ఆగస్టు 25: ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చందు(14) అనే విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శనివారం కడుపు నొప్పి వచ్చిందని మాత్రలు మింగినా తగ్గలేదు. అయితే తల్లిదండ్రులు సరైన వైద్యం చేయించలేదని మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. అది గమనించిన తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటబడిందా... ఇక గోవిందా

ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలతో హడలిపోతున్న రైతులు ● పంపుసెట్ల వద్దే నిద్ర ● పట్టించుకోని విద్యుత్ అధికారులు ● గస్తీపెంచి చోరీలు అరికడతాం : సీఐ

చెన్నూరు, ఆగస్టు 25: లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్లు కనిపిస్తే గోవిందా అని అనాల్సిందే. చూపుపడిందంటే అది మాయమవ్వాల్సిందే. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలతో హడలిపోతున్న రైతులు భయంతో పంపుసెట్ల వద్దే నిద్ర పోతున్నకాలాలు. బోర్లు ఏర్పాటు చేసుకుంటే కాల్వలకు నీరు వచ్చినా రాకపోయినా రెండు సీజన్లలోనూ పంటలు పండించుకోవచ్చనే ఆలోచన వారిది. వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువు, పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని మోటార్లు బిగించుకుంటే అవి కాస్త దొంగలపాలవుతున్నాయి. ఒక్క వ్యవసాయ మోటరు చోరీకి గురైనా, ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టినా రైతు రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షలు నష్టపోవాలి. అప్పు చేసిన రైతులు దొంగల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. దిక్కుతోచక దొంగలు ఎప్పుడు పడతారో అన్న భయంతో పంపుసెట్ల వద్దే రాత్రివేళ నిద్రపోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకెళితే..

మండల వ్యాప్తంగా 240 సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, 1600 వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో కాస్త పొలాల వైపు ఏవైనా ఉన్నా రోడ్డుకు దూరంగా ఉన్నా వీటిపై దొంగలు కన్నేస్తున్నారు. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టితే వీటి వల్ల ఆ ప్రాంతంలో గృహ వినియోగం, వీధిలైట్లకు తీవ్ర ఇబ్బంది. దాని ధర లక్షా 60వేల నుంచి లక్ష 70వేల వరకు ఉంటుంది. అదే 2 ఫేజ్, 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొడితే రైతుకు తీవ్ర ఇబ్బంది. మళ్లీ కొత్తవి కొనాలంటే తలప్రాణం తోకకు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాదిగా మండల వ్యాప్తంగా వ్యవసాయ పంపు సెట్లకు కనెక్షన్ ఇచ్చుకునే వైర్లు మీటర్ల కొద్దీ దొంగతనాలు జరిగాయి. ఎందరో రైతులు తమ పంపు సెట్టుకు ఉన్న 50మీటర్లు వైరు, 100 మీటర్లు చోరీ అయిందని పలురకాలుగా చెబుతున్నారు, ఫిర్యాదులు



శేషయ్యగారిపల్లె వద్ద పగులగొట్టబడిన ట్రాన్స్‌ఫార్మరు

చేస్తునే ఉన్నారు. అయితే అవి రికవరీ కావడం అతి తక్కువే. ఎందుకంటే చోరీ చేసిన వ్యక్తి వాటిని ఎవరికి అమ్ముతున్నారో తెలియదు, ఏం చేస్తున్నాడో తెలియదు, పైగా వాటి విలువ ట్రాన్స్‌ఫార్మరుతో పోల్చుకుంటే తక్కువే కాబట్టి కొందరు రైతులు సైతం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం, ఒక వేళ చేసినా పెద్దగా ఫలితం లేకపోవడంతో మిన్నకుంటున్నారు. ఇటీవల సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ మరీ ఎక్కువైంది. వీటిని పగులగొడితే అందులోని 50 నుంచి 60లీటర్ల ఆయిల్ వృథాగా నేలపై పోయడం, అందులో పది కిలోల కాపర్ వైరు తీసుకెళ్లి అమ్ముకుంటారు. అయితే ట్రాన్స్‌ఫార్మరు విలువ రూ.లక్షా 60వేలు ఉంటే చోరీ చేసిన వ్యక్తి పది కిలోల కాపర్ వైరు అమ్ముకుంటే కిలో రూ.700 లెక్కన పది కిలోలకు రూ.7వేలు వస్తుంది. అతనికి వచ్చేది రూ.7వేలు అయితే ట్రాన్స్‌ఫార్మరు పగులగొట్టడంతో నష్టం రూ.లక్షా 70వేలు. ఇటీవలే తోళ్లగంగనపల్లె వద్ద దుగ్గనపల్లె, మదీనా కాలేజీ, శేషయ్యగారిల్లె సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు చోరీ జరిగింది. అంతేకాక 2 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మరు, ఒకటి త్రీఫేజ్ పగలగొట్టారు. వీటి ద్వారా రైతుకు పెద్దనష్టమే జరిగింది. అటు గృహ వినియోగదారులకు, ఇటు రైతులకు నష్టం కలిగిస్తున్న దొంగలపై చర్యలు తీసుకోవాలంటూ ఎంతో కాలంగా రైతులు, వినియోగదారులు కోరుతూనే ఉన్నారు.



స్తంభం నుంచి చోరీకి గురైన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మరు

దొంగతనాలపై ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం



మండలంలో సింగిల్‌ఫేజ్, 2ఫేజ్, త్రీఫేజ్ ట్రాన్స్‌ఫారాలు పగులగొట్టడంతో పలుమార్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రికవరీ లేదు. ఇప్పుడు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొడుతూనే ఉన్నారు. వీటిపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే రైతులు, వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుంది. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మరు కొనాలంటే ప్రతి మారు లక్షా 60వేలు పెట్టాలి. ఎన్నిమార్లు దొంగతనాలు జరిగి పగులగొట్టినా అన్ని మార్లు డబ్బు ఎలా వస్తాయి. ఈ దొంగతనాలు అరికట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందే.

- రామలింగారెడ్డి, ఏఈ, ట్రాన్స్‌కో

మోటార్ల వద్దే నిద్రపోతున్నాం



ఇటీవల జరిగే దొంగతనాలు చూస్తుంటే భయం వేస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మోటర్లు చోరీ చేస్తే చిన్న, సన్న కారు రైతులు ఎలా బతకాలి. మోటారు కొనాలంటే కనీసం రూ.50వేలు పెట్టుబడి పెట్టాలి. మండలంలో ఇటీవల మోటార్ల దొగతనాలు ఎక్కువవుతున్నాయని రైతులు వాపోతూనే ఉన్నారు. రామనపల్లె, ముండ్లపల్లె పొలాల్లో ఇటీవల ఓ రైతుకు చెందిన పాత, కొత్త మోటరు రెండూ చోరీకి గురయ్యాయి. ముండ్లపల్లె వద్ద వ్యవసాయ మోటారు ఒకటి చోరీకి గురైంది. ఇవ న్నీ చూస్తుంటే మాకు నిద్ర ఎలా పడుతుంది.

- గుర్విరెడ్డి. రైతు, కొండపేట

గస్తీ పెంచి చోరీలు అరికడతాం



ట్రాన్స్‌ఫార్మర్లు పగుల గొట్టారని ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు చేశారు. దొంగతనాలు చేయడం వల్ల అందరికీ నష్టమే. తాను విధుల్లో చేరి నాలుగు రోజులైంది. ప్రతి ఫిర్యాదు తీసుకుంటా. గ్రామాల్లో మరింత గస్తీ పెంచి నిత్యం పరిరక్షించడం జరిగేలా చూస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి గస్తీ చేసేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. రాత్రివేళ సైతం పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడుతుంటాం. మోటార్లు, స్టాటర్లు దొంగతనాలకు గురికాకుండా తన వంతు గట్టి ప్రయత్నం చేస్తాం.

- ఆర్.పురుషోత్తంరాజు, సీఐ, చెన్నూరు

218 పరుగుల ఆధిక్యంలో చిత్తూరు



విజయ్‌రామిరెడ్డి (కడప)



నిఖిత్ (చిత్తూరు)



రెడ్డి ప్రకాశ్ (చిత్తూరు)



మనోజ్‌రాజు (కర్నూలు)

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 25: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్ రెండో రోజు ఆదివారం చిత్తూరు జట్టు 218 పరుగుల ఆధిక్యతతో వుండగా, మరో మ్యాచ్‌లో వి జయానికి 272 పరుగుల దూరంలో నెల్లూరు జట్టు ఎదురీదుతోంది.

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల నడుమ సాగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొద టి ఇన్నింగ్స్‌లో మొద టి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పో యి 395 పరుగులు చేయగా బ్యాటర్ నిఖిత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న సంగతి తెలిసిందే.

రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 12.1 ఓవ ర్లకు మొత్తంగా 102.1 ఓవర్లకు 7 వికెట్లు కో ల్పోయి 450 పరుగులకు డిక్లేర్ చేసింది. 60 పరుగులతో నాటౌ ట్ బ్యాట్స్‌మెన్ నిఖిత్ 93 పరుగులు చేశా రు. కడప జట్టు మొ దటి ఇన్నింగ్స్‌లో 64.5 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌట్ అయిం ది. విజయ్‌రామిరెడ్డి (బ్యాటర్) 83 పరుగులు చేశారు. చిత్తూరు జట్టు బౌలర్ రెడ్డిప్రకాశ్‌కు 5 వికెట్లు లభించాయి. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు 218 పరుగుల ఆధిక్యత లభించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో...

ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల నడుమ సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ కాబడింది. నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. రెండో రోజున బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మరో 17.2 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి మరో 87 పరుగులు జోడించి మొత్తంగా 174 పరుగులకు ఆలౌట్ అయ్యారు. దీంతో కర్నూలు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 85 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయింది. మనోజ్‌రాజు (బ్యాటర్) 86 పరుగులు చేయగా మరో బ్యాటర్ షేక్ ఇస్మాయిల్ 51 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. మొత్తంగా కర్నూలు జట్టు 322 పరుగుల ఆధిక్యత సాధించింది. కాగా విజయానికి 323 పరుగుల లక్ష్యంగా బరిలోకి దిగిన నెల్లూరు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులతో నిలిచింది. ఇందులో షేక్ అబ్బాస్ 31 పరుగులతో ఎస్ వర్మ 15 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. విజయానికి నెల్లూరు జట్టు మరో 272 పరుగులు చేయాల్సివుంది. సోమవారం ఆటకు చివరిరోజు.

లఖ్‌పతి దీదీతో ఆర్థిక పరిపుష్టి

జిల్లాలో 6479 మందికి లఖ్-పతి దీదీ ప్రొటెన్షియల్ సర్టిఫికెట్లు పంపిణీ : కలెక్టర్ శివశంకర్



మహిళా సంఘాలకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) ఆగస్టు25: మహిళా సాధికారత సాధనతోనే కుటుంబాల ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి, సమాజం అభివృ ద్ధి పథంలో నడుస్తోందని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం మహరాష్ట్రలోని జెల్గాన్ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్‌పతి దీదీ కింద మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు నుంచి కలెక్టర్ మాట్లాడుతూ మహిళల స్వయం సమృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. లఖ్‌పతి దీదీ పథకం దేశ ప్రధానినరేంద్ర మోదీ తీసుకు రావడం మహిళల అదృష్టమన్నారు. ప్రభుత్వం అందించిన లక్ష రూపాయిల రుణాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యం ఉన్న రంగంలో యూనిట్లను ప్రారంభించి జీవనోపాధి పెంచుకోవాలన్నారు. లఖ్‌పతి దీదీ అంటే లక్ష రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక కుటుంబం ఆదాయాన్ని ఆర్జించే ఒక స్వయం సహాయక సంఘం సభ్యురాలని, ఈ ఆదాయం సగటు నెలవారీ ఆదాయం పదివేలు మించి ఉండేలా చూడడమే ఈ పథక లక్ష్యమన్నారు. కనీసం నాగు వ్యవసాయ రుతువులు లేదా వ్యాపారాలకు వర్తిస్తుందన్నారు. మహిళలు స్థిరమైన జీవనోపాధి పద్ధతులను వనరులను సమర్థవంతంగా నిర్వహించి మంచి జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచేందుకే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వంద రోజుల ప్రణాళిక లో భాగంగా కేటాయించిన లక్ష్యాన్ని సాధించారన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నత సామాజిక పెట్టుబడినిధి ద్వారా లఖ్ -పతి దీదీలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. పండ్ల తోటల పెంపకం, చేపలు, పశు పెంపకాలకు, శాఖల సమన్వయంతో లఖ్ -పతి దీదీలను లక్ష్యాధి కారులను చేస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 107.972 ప్రొటెన్షియల్ లఖ్‌పతి దీదీలకు రుణ సదుపాయం కల్పించే లక్ష్యంగా నిర్ణయించా మన్నారు. జిల్లాలో నడుస్తున్న గ్రామ సమాఖ్యకు 5-10 చొప్పున 6479 మందిని గుర్తించి అందులో 2154 మందికి సీఐఎఫ్ లఖ్‌పతి దీదీలకు రూ.11.13కోట్లు మంజూరు చేశా మన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 7902 మందికి రూ.94.45 కోట్లు మంజూరు జరిగిందన్నారు. కార్యక్రమంలో 6479 మం ది లఖ్‌పతి దీదీలకు కలెక్టర్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశా రు. డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎల్డీఎం జనార్ధనం, స్వయం సహాయక సంఘాలు, హహిళలు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి సొంత భూమిలో కమ్యూనిటీ భవనం



కమ్యూనిటీ భవనం భూమిపూజ చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 25: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి స్వగ్రామం టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలోని సొంత భూమిలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధి గాంచిన సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలో రూ.10 లక్షలతో ఆదివారం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంగమేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త రామాంజనేయరెడ్డి, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, టి.సదుం పంచాయతీ సర్పంచ్ శారద అధ్యక్షతన ముఖ్య అతిధులుగా లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, స్వర్ణలత రెడ్డి దంపతులు హాజరై ఆలయ ప్రాంగణలోని సొంత భూమిలో భవన నిర్మాణం చేపట్టేందుకు భూమిని ఆలయానికి కేటాయించామన్నారు. సంగమేశ్వరస్వామి తమ కుటుంబానికి ఆరాధ్య దైవమని ఆలయ అభివృద్ధిలో భాగంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అనంతరం టి.సదుం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సన్మాన సభలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తంపతులను సర్పంచ్, గ్రామస్థులు ప్రత్యేకంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం లోకాయుక్త జస్టిస్ నుంచి టి.సదుం గ్రామానికి చెందిన గ్రూపు సభ్యులకు 4.5 లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో మనోజ్‌జయంత్‌రెడ్డి, బి.కొత్తకోట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షుడు కుడుం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్య క్షుడు ఆనంద్‌రెడ్డి, ములకలచెరువు టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, పెద్దమండ్యం అధ్యక్షుడు బిల్డర్ రమణ, నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, బస్సు బయ్యారెడ్డి, తాడిగో ళ్లపల్లె సుధాకర్‌రెడ్డి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్లు.. రాకపోకలకు పాట్లు

● కంకర రోడ్లయినా వేయాలంటూ రైతుల వేడుకోలు



అధ్వానంగా మారిన చెన్నూరు పెద్దకాల్వ నుంచి రామనపల్లెకు వెళ్లే ఆయకట్టు రోడ్డు..



గుంతలమయంగా ముండ్లపల్లె రహదారి

చెన్నూరు, ఆగస్టు 25 :మండలంలో ఆయకట్టు రోడ్లు అధ్వానంగా మారాయి. ఐదేళ్లుగా ఏ మాత్రం వాటిని పట్టించుకోకపోవడంతో ఆ రోడ్లపై నిత్యం తిరిగే అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏమో అన్నదాలను ఆదుకుంటాం, వారి సమస్యలు తీరుస్తాం, వారు లేనిదే పిడికెడు గింజలు కూడా ఉండవు అని చెప్పడమే తప్ప చేతల్లో మాత్రం శూన్యం అయిపోయింది. ఆకలి తీర్చే అన్నదాత గుంతలు తేలిన రోడ్లపైనే రాకపోకలు సాగిస్తూ బాధపడుతున్నాడు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో రోడ్లు వేశారు తప్ప ఆ తరువాత వచ్చిన పాలకులు మాత్రం వాటిపై దృష్టి సారించలేదు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వేయాల్సిన రోడ్లు నిధులు అందక గుంతలు తేలాయి. ఆ గుంతల్లో రాకపోకలు సాగించాలంటే రైతులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మండలంలో చెన్నూరు, రామనపల్లె, ముండ్లపల్లె, గుర్రంపాడు, శివాలపల్లె, కొక్కిరాయపల్లెకు ఇలా అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లు అత్యంత దారుణంగా మారాయి. చినుకుపడితే ప్రతి రోడ్డు ఛిద్రమే. మొత్తం బురదమయం. అడుగు వేస్తే జారి పడాల్సిందే. ఆటోలు తిరగవు. ద్విచక్ర వాహనాలు వెళితే ఆ బరదలో స్వరూపాలే మారిపోతాయి. ట్రాక్టర్లపై ప్రయాణిస్తే అవి బంతిలా ఎగురుకుంటూ వెల్లాల్సిందే. ఇలాంటి రోడ్లను 2019-24 మధ్య ఉన్న వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీసం ఒక్క రోడ్డు కూడా సక్రమంగా వేయకుండా అన్నదాతలపై వివక్ష చూపింది. దీంతో మండల రైతులు కొత్తగా వచ్చిన కూటమి పాలనలో అయినా రోడ్లు బాగుపడతాయా అంటూ ఎదురు చూస్తున్నారు. ఇదే టీడీపీ పాలనలో గతంలో ప్రజల వద్దకు పాలన, ఆ తరువాత జన్మభూమి ఈ రెండు సమయాల్లో మండలంలోని ఊరూరికి మట్టిరోడ్లు ఏర్పాటయ్యాయి. ప్రతి ఊరుకి, మండల కేంద్రానికి అనుసంధానం ఏర్పడింది. 20 ఏళ్లక్రితం తారురోడ్లు సరిగా ఉండేవి కావు. దీంతో అప్పుడు వేసిన గ్రావెల్, మట్టిరోడ్లే రైతులకు పెద్ద వరంగా మారాయి. రైతు లు వ్యవసాయ పనులు చేసుకోవాలన్నా, కోసిన పంట ఇంటికి తెచ్చుకోవాలన్నా ఇబ్బందిపడకుండా సంతోషంగా చేసుకునేవారు. ఒక్క వైసీపీ పాలనలో మాత్రం రోడ్లు అత్యంత దారుణంగా మారాయని, చివరికి నిధులు కూడా ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులే చెప్పడం విశేషం. ఇప్పుడు వచ్చిన కూటమి పాలన అయినా అన్నదాతల అగచాట్లు తీరుస్తుందన్న నమ్మకంతో రోడ్లు ఎప్పుడు వేస్తారా అని ఎదురు చూస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు.

ఆయకట్టు రోడ్లు వేయాలి



రామనపల్లె, ముండ్లపల్లె వెళ్లే రోడ్డు దారుణంగా ఉన్నాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటే నరకంగా ఉంది. రోడ్లను ఇంత అధ్వానంగా ఉంచిన ఘనత గత ప్రభుత్వానిదే. ఇప్పుడు మహర్దశ ఏర్పడుతుందని నమ్మకం ఉంది.

- రాజశేఖర్‌రెడ్డి, రైతు, ముండ్లపల్లె

కాల్వకట్ట రోడ్లే కీలకం



రైతుకు ఎక్కువగా ఆయకట్టు రోడ్డుకంటే కాల్వకట్ట రోడ్డే ప్రధానం. వాటిని వేయాలంటే ఖర్చుతో కూడుకున్నపని కూడా కాదు. నిధులతో వీలైనంత త్వరగా రోడ్లు బాగు చేయాలి.

- పి.వెంకటసుబ్బారెడ్డి, రైతు, రామనపల్లె

రోడ్లు వేసే అవకాశం వచ్చింది



ఉపాధి పథకం ద్వారా ప్రతి పంచాయతీలో రోడ్లు వేసే అవకాశం వచ్చింది. రైతులు ఆయకట్టు రోడ్లు అడుగుతున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి రోడ్డుపై దృష్టి సారిస్తున్నాం.

- ఎం.మురళి, డీఈ, పంచాయతీరాజ్

అధికారం మారినా మారని అధికారుల తీరు



పెండ్లిమర్రి సచివాలయంలో ఉన్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో

పెండ్లిమర్రి, ఆగస్టు 25: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో అధికారం మారినా అధికారులు మాత్రం తమ నిర్లక్ష్యం వీడలేదు. గడిచిన వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోను ఏర్పాటుచేశారు.అయితే కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తు న్నా మాజీ ముఖ్యమంత్రి ఫోటోను తొలగించలేదు. మన పంచాయతీ మన సాధికారికత కార్యక్రమంలో భాగంగా పెండ్లిమర్రి గ్రామ సచివాలయంలో గ్రామసభకు ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి వస్తున్నారన్న కనీస ఆలోచన కూడా లేకుండా ఆ ఫోటోను తొలిగించకుండా అలాగే ఉంచారు. దీంతో గ్రామ ప్రజలు ఇదేమి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. దీన్నిబట్టి ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది.

ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే సీఎం ధ్యేయం



సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వల్లూరు, ఆగస్టు 25 : ప్రతి డ్వాక్రా మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఏపీఎం శైలజ, టీడీపీ వల్లూరు మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రధాన మంత్రి వీడియో సందేశమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో డ్వాక్రా సంఘాలు స్థాపించి మహిళా అభివృద్ధి కోసం పాటుపడిన ఘనత చంద్రబాబుదన్నారు. ఆర్థికంగా ఎదిగితే వారి ఇల్లే కాక గ్రామం యావత్తు రాష్ట్రం కూడా ఆర్థికంగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల్లో రుణాలు తీసుకున్న వారు నిర్ణీత సమయంలో చెల్లించి తద్వారా వారు జీవనోపాధి కల్పించుకుంటే ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. ఎప్పుడైతే రుణాలు త్వరగా చెల్లిస్తారో బ్యాంకు కూడా రుణంపెంచి వారి అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం గ్రామ సమాఖ్య సభ్యులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి ప్రశాంత్, టీడీపీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, కొప్పోలు మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి జాతర



పూజలు అందుకుంటున్న మారెమ్మ తల్లి

సీకేదిన్నె, ఆగస్టు 25: చింత కొవ్మదిన్నె మండలం అంగడి వీధిలో ముత్తు మారెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరిలో అమవాస్య ముందు ఆదివారం మారెమ్మ జాతరను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని కోరినకోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు చెప్పుకుంటుంటారు. సంతానం లేనివారు, పెళ్లికానివారు అమ్మవారిని మొక్కుకుంటే వారి కోర్కెలు తీరుతాయని కోర్కెలు తీరినవారు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. అందులో భాగంగా అమ్మవారికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మట్లి వేణుభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీరాములు, కుళాయప్ప, సుబ్బయ్య, జయరాజ్ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

యూపీఎస్‌పై అధ్యయనం చేయాలి: ఒంటేరు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశతలపెట్టిన యూపీఎస్ పింఛను పథకం ఉద్యోగులకు ఉపయోగకరమైనదా, లేదా అనే విషయంపై లోతైన అధ్యయనం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం ఎంటీఎస్ స్థానంలో యునైటెడ్ పెన్సన్ స్కీం తీసుకువస్తామని చెప్పడం ఉద్యోగులకు లబ్ధి చేకూరితేనే వారు స్వాగతిస్తారన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు తమ కనీస హక్కు అయినటువంటి పించను కోసం పోరాటాలు చేస్తున్నారని, ప్రభుత్వం వారికి పాతపింఛను పథకం అందించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

పేలుడు ఘటనలో బాధితులను ఆదుకోవాలి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 25 : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్సియా ఫార్మలో పేలుడు ఘటనలో చనిపోయిన కుటుంబాల వారిని ఆర్థికంగా ఆదుకోవాలని, ఆ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బి.మనోహర్, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కోశాధికారి బి.లక్ష్మిదేవి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 21న ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు ఇప్పటికీ సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు.

విద్యను నిర్వీర్యం చేసిన వారిపై విచారణ జరిపించాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : జిల్లాలో పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయం వరకు గత వైసీపీ ప్రభుత్వంలో అత్యంత అవినీతికి పాల్పడిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే జునైద్‌బాషా డిమాండ్ చేశారు.ఆదివారం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వైవీయూ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో మాజీ ముఖ్యమంత్రి జగన్ బావమరిది ఈసీ సురేంద్రనాథరెడ్డి, వైస్‌చాన్సలర్లు సూర్యకళావతి, చింతా సుధాకర్, రిజిస్ట్రారు విజయరావప్రసాద్, వెంకటసుబ్బయ్య వైసీపీ నాయకుల అండదండలతో లక్షలాది రూపాయలు నిరుద్యోగుల నుంచి తీసుకుని ఎటువంటి నోటిఫికేషన్, రోస్టరు పద్ధతి లేకుండా ఔట్‌సోర్సింగ్ డైలీవేజస్ పేరుతో ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. మాజీ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి నాడు-నేడు పాఠశాలల పేరుతో నిధులు గోల్ మాల్ చేశారని ఆరోపించారు. ఆ ప్రభుత్వంలో భవిత పోస్టులకు సంబంధించి లక్షలాది రూపాయలు డబ్బు తీసుకుని అమ్ముకున్నారన్నారు.

ఎయిడెడ్ పోస్టుల పేరుతో నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు డబ్బు తీసుకుని స్వయానా ఆర్‌జేడీ, డీఈఓ, డిప్యూటీ డీఈవో సైతం మామూలు తీసుకుని పోస్టులు భర్తీచేశారన్నారు. అలాగే మరికొన్ని శాఖల్లో కూడా ఇదే వ్యవహారం సాగిందన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించి సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా పైడికాల్వ చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న గాలిబాలి

వల్లూరు, ఆగస్టు 25 : మండల పరిధిలోని పైడికాల్వ గ్రామంలో చర్చి సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి కడప మేత్రాసన పీఠాధిపతి గాలిబాలి హాజరైన సందర్భంగా ప్రత్యేక వేడకలు నిర్వహించినట్లు చర్చి ఫాదర్ జీవన్‌కుమార్ తెలిపారు. గత మూడు రోజులుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామన్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందించామన్నారు. ఆదివారం గాలిబాలి వచ్చిన సందర్భంగా ఆయనను సాదరంగా ఆహ్వానించామని తెలిపారు. అనంతరం 50 మంది గురువులతో దివ్యబలిపూజ సమర్పించి మరియమాత దీవెనలు అందరికీ ఉండాలని వారు దీవించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ వేడుకలు పైడికాల్వ గ్రామ క్రైస్తవుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు వివరించారు.

వ్యవహారిక భాష కోసం గిడుగు కృషి ప్రశంసనీయం



తెలుగు ఉపాధ్యాయులను సత్కరించిన ఆర్‌యూపీపీ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : వ్యవహారిక భాష అమలు కోసం గిడుగు రామ్మూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి అన్నారు. ఆదివారం బ్రౌన్ గ్రంథాలయంలో తెలుగుభాషా దినోత్సవం, గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యదర్శి గంగనపల్లె వెంకటరమణ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాషా అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో తెలుగుభాషా సామర్థ్యాల పెంపునకు తెలుగు ఉపాధ్యాయులు కృషి చేయాలని, తద్వారా భాషా సంస్కృతులు కాపాడాలని కోరారు. విద్యార్థుల్లోని తెలుగు భాషకు సంబంధించిన నైపుణ్యాలను గుర్తించి వాటికి మెరుగులు దిద్దాలని కోరారు. ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యదర్శి గంగనపల్లె వెంకటరమణ మాట్లాడుతూ తెలుగుభాష అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. వాటన్నింటినీ అధిగమించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్‌యూపీపీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పద్మనాభయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, పాఠ్యపుస్తకాల రచయిత నాగసుబ్బయ్య మాట్లాడారు. అనంతరం 20 మంది తెలుగు ఉపాధ్యాయులను ఆర్‌యూపీపీ ఆధ్వర్యంలో సత్కరించారు. రాష్ట్ర నాయకుల గంగిరెడ్డి, రమణయ్య, వరప్రసాద్‌రెడ్డి, రమణమూర్తి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 25: రాష్ట్రంలో కబ్జాదారుల కబంధ హస్తాల నుండి భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని, ఈ నెల 28న విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం గోడపత్రాల విడుదలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ రెడ్డి పాలనలో భూమాఫియా ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా, శివశంకర్ పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి మరింత కృషి'

వేంపల్లె, ఆగస్టు 25: వైసీపీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నూతనంగా పార్టీ పదవి పొందిన ఆయన ఆదివారం వేంపల్లెకు వచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీని కలిసిన సీఐ జీవన్‌గంగాధర్‌బాబు

పులివెందుల టౌన్, ఆగస్టు 25: సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందులలోని ఆయన స్వగృహంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను చెప్పుకొని అర్జీలు అందించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ ప్రజలకు సూచించారు. పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జీవన్ గంగాధర్‌బాబు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పులివెందుల టౌన్, ఆగస్టు 25: పట్టణంలోని కదిరిరోడ్డు సమీపంలో జూదమాడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ జీవన్ గంగాధర్‌బాబు తెలిపారు. అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులుచేసి ఆరుగురుని పట్టుకొని రూ.32వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు జీవనోపాధిని మెరుగుపరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, ఆగస్టు 25: ప్రతి మహిళ జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని చెర్లోపల్లె సర్పంచు గంగిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్యలో ఆదివారం లక్‌పత్ దిది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గంగిరెడ్డి, నాగమల్లారెడ్డిలు హాజరై మాట్లాడారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కోరుకుంటున్నాయన్నారు. ప్రతి మహిళ జీవనోపాదులు మెరుగుపరచుకోవాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని తెలిపారు.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించాలి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 25 : ఎసెన్షియా ఫార్మ కంపెనీలో జరిగిన ఘోర దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి జిల్లాలో కలెక్టర్ల అధ్యక్షతన ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్, కార్మికశాఖ, పరిశ్రమల శాఖ అధికారుల సమక్షంలో పరిశ్రమల యాజమాన్యాల సమక్షంలో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ చర్యలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహించాలని ఎఐటీయుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక హోచిమన్‌భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పరిశ్రమల్లోకి వెళ్లిన కార్మికుడు సేఫ్టీగా బయటికి వస్తాడన్న గ్యారంటీ ప్రస్తుతం లేదన్నారు. భద్రతా చర్యలు లోపించడంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్మికులకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.

రామగిరి బాబాను వెంటనే అరెస్టు చేయాలి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు



ర్యాలీగా వస్తున్న ముస్లిం మైనార్టీలు, మత గురువులు, నేతలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : రామగిరి బాబాపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలో ముస్లిం మైనార్టీ మత గురువులు, నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్తపై రామగిరిబాబా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రామగిరిబాబాపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, బాబుబాయి, బాగ్దాది, మన్సూర్ ఆలీఖాన్, ఆరిఫుల్లా, జిలాన్, అహ్మద్‌బాషా, నయీం,నాజర్‌ఆలీ, మతపెద్దలు, ఇమాంలు, గురువులు,ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్ ఆలీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : కడప నగరం మెడికేర్ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబరానికి విశేష స్పందన లభించిందని ప్రముఖ వైద్యుడు మహబూబ్ ఆలీ తెలిపారు. ఆదివారం మెడికేర్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 3 వేలు విలువ గల షుగరు, కొలెస్ట్రాల్, ఈసీజీ, న్యూరోపతి పరీక్షలు ఉచితంగా నిర్వహించామన్నారు. అనంతరం డాక్టర్ మహబూబ్ ఆలీ మాట్లాడుతూ మధుమేహం వ్యాధిని వైద్యపరిభాషలో డయాబెటిస్ అంటారన్నారు. ఈ వ్యాధి శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి దాని పనితీరు తగ్గడం వల్ల ఎదురవుతుందన్నారు. మన రక్తంలోకి వచ్చే చక్కెర లేదా గ్లూకోజ్‌ను శక్తిగా మార్చే ప్రక్రియకు ఆటంకం ఎదురైనప్పుడు ఈ సమస్య బారిన పడినట్లు భావిస్తారన్నారు. డయాబెటిస్‌కు మూలకారణం రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా పోగవడమేనన్నారు. రక్తంలో చక్కెరస్థాయి అధికంగా ఉంటే తీవ్రమైన ఆరగ్యో సమస్యకు దారి తీస్తుంద న్నారు. గుండెపోటు, చూపు తగ్గడం, పాదాలు, కాళ్లు తొలగించాల్సి రావడం, కిడ్నీల వైఫల్యం లాంటి పరిణామాలకు డయాబెటిస్ కారణమవుతుందన్నారు. తల్లిదండ్రులకు డయాబెటిస్ ఉన్నా వంశపారపర్యంగా రావచ్చన్నారు. అధిక బరువు, ఊబకాయం ఉన్నవారికి డయాబెటిస్ వస్తుందన్నారు. సయ్యద్ నూర్, షాహిద్, పఠాన్, గౌతమి, ఆయేషా, భార్గవి, వైష్ణవి, శిరీషారెడ్డి, సబీహా, మాధవీ, మహిత, సువర్ణలతో పాటు మెడికల్ రెప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 25 : స్థానిక రైల్వేగేటు సమీపంలో వెలసిన శ్రీరాధాక్రిష్ణ ఆలయంలో సోమవారం జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు పూర్తి చేశారు. సోమవారం ఉదయం వివిధ రకాల పూజలు హో మాలు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, బండలాగుడు, ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందుకోసం స్థల పరిశీలన, సదుపాయాలను సమకూర్చేందుకు ఏర్పాటు చేశారు. రాధాక్రిష్ణ ఆలయాన్ని రంగురంగులవిద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పుత్తా కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని శ్రీరాధాక్రిష్ణుల కృపకు పాత్రులు కావాలని ఆయన తెలిపారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 :కేంద్ర ప్రభుత్వం కేబినెట్‌లో ప్రకటించిన సీపీఎస్‌కు బదులుగా యునైటెడ్‌పెన్షన్ స్కీం తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, పాత పె న్షన్ విధానమే అమలు చేయాలని ఎస్టీఎఫ్ అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తీసుకొస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఉద్యోగుల జీతం నుంచి ఎటువంటి కోత లేకుండా రిటైర్ అయ్యే సమయంలో పెన్షన్ కావాలని కోరుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కోరకునేది ఓపీఎస్ మాత్రమేనని, సీపీఎస్, జీపీఎస్ అని పేర్లు మార్చుతూ ఉద్యోగులపై రుద్దే కార్యక్రమం మానుకోవాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శులు ప్రసాద్, శ్రీరాం, సలాం, రవిశంకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు కోరుకుంటున్న ఓపీఎస్ పింఛను పథకం రావాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : ఉద్యోగులు కోరకుంటున్నది ఓపీఎస్ మాత్రమేనని, అదే కావాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం ఆమోదించిన యూపీఎస్‌పై మాట్లాడుతూ యూపీఎస్, జీపీఎస్‌లు ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తే కంట్రిబ్యూషన్ లేని పింఛను పథకంతో 50 శాతం గరిష్ట పింఛనుకు డీఏ, పీఆర్సీలను అనువర్తింపజేస్తూ గ్రాడ్యుటీ పెరుగుదలతో కూడిన కుటుంబ పింఛను అమలుపరిచే పింఛను పథకాన్ని అమలు చేయాలని కోరారు.

రియల్.. ఢమాల్!

- అక్రమ లేఅవుట్లపై అధికారుల దాడులు ● అయినా.. ఆగని అక్రమ వెంచర్లు ● ఆకాశాన్నంటిన ధరలు
- రిజిస్టరు కాక ప్లాట్లు కొన్నవారి ఆందోళన ● కొనుగోలుదారులు లేక రియల్ వ్యాపారుల డీలా..



జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని రియల్ఎస్టేట్ వెంచర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 25: ధరల పెరుగుదల, అక్రమ వెంచర్లను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు దాడులు ముమ్మరం చేయడం, కొనుగోలు చేసిన ప్లాట్లు రిజిస్టర్ కాకపోవడం వంటి పలు కారణాలు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి గండి కొడుతున్నాయి.

జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో 2006 నుంచి 2023 వరకు రియల్ దందా జోరుగా సాగింది. దీంతో అనుభవం లేనివారు సైతం బ్రోకర్లుగా మారి బాగా డబ్బు సంపాదించారు. అయితే జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల అక్రమ లేఅవుట్లు ఉన్నాయన్న ఉద్దేశంతో 2024 జూలై నుంచి ప్రొద్దుటూరు రోడ్డులోని పలు వెంచర్లపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి, అందులో వేసి నంబరు రాళ్లను తొలగించారు. మోరగుడి, తాడిపత్రి రోడ్డు, మైలవరం, అనంతగిరి, గండికోట వెళ్లే దారుల్లో సైతం అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాడుల అనంతరం మున్సిపల్ అధికారుల సూచన మేరకు అనుమతి లేని లేఅవుట్లలోని స్థలాల రిజిస్ట్రేషన్లను అధికారులు నిలిపివేశారు. దీంతో ఆయా లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు లబోదిబోమంటున్నారు. మరికొందరు అధికారులను, స్టాంప్ రైటర్లను అడ్డుపెట్టుకుని రిజిస్టర్లు చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే కొన్ని వెంచర్ల విషయంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా . ప్రస్తుతం జమ్మలమడుగు చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు స్థలాల ధరలు ఆకాశాన్ని అంటడంతో అంత ధరలు పెట్టి స్థలం కొని ఇళ్లు నిర్మించేవాడు కరువయ్యాడని మరికొందరు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. జమ్మలమడుగులో అనేక మంది రియల్ వ్యాపారులు వ్యాపారం లేక ప్రొద్దుటూరు, ఆళ్లగడ్డ, ముద్దనూరు తదితర ప్రాంతాలకు వెళుతున్నా అక్కడా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆందోళనకు గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రియల్ వ్యాపారులు అప్పులు చెల్లించలేక ఐపీలు కూడా పెట్టే అవకాశం ఉందని మరికొందరు వాపోతున్నారు.

ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం దుర్వినియోగం

● విలేకరుల సమావేశంలో మాజీ డీలర్ ఆరోపణ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25: వార్డు కౌన్సిలర్ జంబాపురం లక్ష్మీదేవి, ఆమె భర్త రామాంజనేయరెడ్డి రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారని రేషన్‌షాపు మాజీ డీలర్ మహబూబ్‌బాషా ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మూడవ వార్డులోని కౌన్సిలర్ నివాసం పక్కన ఉన్న ఇంట్లో 36 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిలువ చేశారని జాయింట్ కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా, తనిఖీ చేయడానికి వచ్చిన రెవెన్యూ అధికారులు కౌన్సిలర్ లక్ష్మీదేవి ఇంటికి తాళాలు వేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చౌక దుకాణం డీలర్‌గా ఉన్న జంబాపురం రామాంజనేయరెడ్డికి 350 కార్డులు ఉండగా అధికారులపై ఒత్తిడి తెచ్చి మరో 368 కార్డులను అదనంగా తమ షాపు పరిధిలో చేర్చుకున్నాడని, మొత్తం 718 రేషన్‌కార్డులకు చెందిన బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుండా అక్రమంగా అమ్ముకుంటున్నాడని విమర్శించారు. వార్డులో ప్రజలకు పింఛన్లు, రేషన్‌కార్డులు, బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తానని డబ్బు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. అవినీతి పరులైన కౌన్సిలర్ దంపతులను చేరదీయడంతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి చెడ్డపేరు వస్తుందని, వారిని దూరం పెట్టాలని సూచించారు.

పాలస్తీనా వివాదంలో కేంద్రానిది నిలకడలేని నిర్ణయం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25: ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదంలో కేంద్ర ప్రభుత్వం నిలకడ లేని నిర్ణయాలు తీసుకుంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం స్త్రీ శక్తి భవన్‌లో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదంలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం గతంలో వాజ్‌పేయి ప్రభుత్వ విధానానికి భిన్నమైన వైఖరిని అనుసరిస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రష్యా, ఉక్రెయిన్ పర్యటన శాంతికి దోహదపడుతుందో లేదో వేచి చూడాలన్నారు. ఇటీవల అనేక దేశాల్లో జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు, సంక్షేమ భావజాలం ఉన్న పార్టీలు అధికారం చేపట్టాయని తెలిపారు. రష్యా, చైనా భారత మైత్రి ప్రపంచంపై అమెరికా ఆధిపత్యాన్ని తొలగిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం వామపక్ష పార్టీలను చట్టసభల్లోకి రాకుండా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ఘోర పరాజయానికి ల్యాండ్ టైటిలింగ్‌యాక్టు కారణమన్నారు. బీజేపీ మిత్రపక్షాలను ఊతకర్రలా ఉపయోగించుకుంటున్న విషయాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీలు గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ నాయకులు రెహమాన్, ముంతాజ్‌బేగం, రాఘవ, విజయకుమార్, సురేష్, బాలసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రామయ్య

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ మాజీ ప్రధాన కార్యదర్శి రామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఆరు వేల మంది ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం ద్వారా ఎటువంటి రక్షణ లేకుండాపోయిందన్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన వాహనదారుల చట్టాల పేరుతో పెద్ద ఎత్తున జరిమానాలు వసూలు చేస్తుండడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారిందన్నారు. వాహన డ్రైవర్ల నుంచి పెద్ద మొత్తంలో జరిమానాలు వసూలు చేస్తున్న ప్రభుత్వం, ఆటో స్టాండులు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆటోడ్రైవర్, వర్కర్స్ యూనియన్ పట్టణాధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మాబు, దొల, కార్యదర్శి మచ్చా శ్రీను, షరీఫ్, ఎల్లయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14, 16 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14లో బాలబాలికలకు ట్రయాథ్లాన్ ఏబీసీ విభాగంలో 60, 600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, బ్యాక్‌త్రో, కిడ్స్ జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. అండర్-16 విభాగంలో బాలబాలికలకు 60, 600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను సెప్టెంబరులో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేశారు. వ్యాయామ సంచాలకులు వెంకటసుబ్బయ్య, సునీల్, శివారెడ్డి, ఎర్రన్న, రాఘవేంద్ర, అంకారావు, నాగేశ్వరరావు, బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్ బాషా పాల్గొన్నారు.

బద్వేలుకు నిరంతరాయంగా నీటి సరఫరా..!

● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీశ్ రెడ్డి


బ్రహ్మంసాగర్ వద్ద మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్‌కుమార్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 25: బద్వేలు మునిసిపాలిటీలోని ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించడమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీశ్ రెడ్డి తెలిపారు. ఆదివారం వారు అధికారులతో కలసి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. బ్రహ్మంసాగర్‌లో నీటి పరిమాణాన్ని, పంపుహౌస్, మోటార్లు, పైపులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో 1.9 టీఎంసీలు మాత్రమే నిలువ ఉన్నా, బద్వేలు మున్సిపాలిటీకి ప్రతిరోజూ 2 క్యూసెక్కులను మోటార్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. భవిష్యత్తులో బద్వేలుకు 4 క్యూసెక్కులు అందేలా చూస్తామన్నారు. రాబోయే రోజుల్లో బ్రహ్మంసాగర్‌లో 16 టీఎంసీలు నిల్వ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరామన్నారు. తాగు, సాగునీటిని అందించడమే టీడీపీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.నరసింహారెడ్డి, జేఈ జగదీష్, డీఈఈలు , బి.మఠం టీడీపీ ఏఈఈలు నాగేశ్వరరావు, బి.మఠం టీడీపీ నేతలు ఎస్.ఆర్. శ్రీనివాసుల రెడ్డి, పురుషోత్తం రెడ్డితో పాటు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 25 : స్థానిక వైఎంఆర్ కాలనీలోని రెండు దుకాణాల్లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఓ చిల్లర అంగడితో పాటు, బిర్యానీ హోటల్‌లో రూ.15 వేలు అపహరించారు. ఆదివారం ఉదయం దుకాణాలకు వెళ్లిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా ఇల్లూరు సచివాలయం

ఎర్రగుంట్ల, ఆగస్టు 25: ఇల్లూరు సచివాలయం మందుబాబులకు అడ్డాగా మారింది. ఆదివారం రాత్రి కొందరు ట్రాక్టర్ డ్రైవర్లు, మరికొందరు సచివాలయం తలుపులు వేసుకుని లో మద్యం సేవిన్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సచివాలయం ప్రధాన ద్వారం నుంచి ఫొటోలు తీసే ప్రయత్నం చేయగా, లోపల గడియ పెట్టుకుని లైట్లు ఆఫ్ చేశారని గ్రామస్తులు తెలిపారు. సచివాలయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండమే ఇందుకు కారణమని అంటున్నారు. కలెక్టర్ వీరిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమ్మాయిలపై దాడులు అరికట్టాలి


కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 25 : అమ్మాయిలపై దాడులు అరికట్టాలని ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. కడప నగరం ప్రభుత్వ బీసీ కళాశాల వసతిగృహంలో ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతంర మాట్లాడుతూ రోజురోజుకూ దేశంలో అమ్మాయిలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆర్ఎస్‌యు నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిశీలన


కళాశాల, భూములను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

మైదుకూరు రూరల్, ఆగస్టు 25: దేవదాయశాఖకు చెందిన భూములను ఆక్రమించారని ఫిర్యాదు అందడంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆదివారం స్థానిక బాలశివ యోగి కళాశాల, సంబంధిత భూములను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

అధ్వానంగా ఆర్టీసీ గ్యారేజీ ప్రాంగణం


గ్యారేజీ ఆవరణ గేటు వద్ద నిలిచిన నీరు (ఫైల్)

జమ్మలమడుగు, ఆగస్టు 25: కొద్దిపాటి వర్షం వచ్చినా జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ప్రాంగణం నీరు నిలుస్తుండడం ప్రయాణికులు, కార్మికులకు అసౌకర్యంగా మారింది. గత ప్రభుత్వంలో జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నిర్లక్ష్యానికి గురైందని వెంటనే చర్యలు తీసుకోవాలని డిపో అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో శనివారం జిల్లా అధికారులు తనిఖీ చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో జమ్మలమడుగు ఆర్టీసీ డిపో అభివృద్ధి చెందుతుందని, సమస్యలు పరిష్కరిస్తారని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

పోరుమామిళ్ల, ఆగస్టు 25 : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ఆదివారం పోరుమామిళ్లలో హిందూ ఐక్యత ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్ర, అసెంబ్లీ కోకన్వీనరు పండరి, పోరుమామిళ్ల, కాశినాయన, బికోడూరు మండలాల నుంచి హిందూ బంధువులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, వీహెచ్ పీ నాయకులు పోరుమామిళ్ల ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

నేడు పాపిరెడ్డిపల్లెలో పంట నమోదు

కాశినాయన ఆగసు 25: రంపాడు పంచాయతీలోని పాపిరెడ్డిపల్లెలో సోమవారం ఉదయం 8గంటల నుంచి పంటనమోదు కార్యక్రమం ఉంటుందని రంపాడు సచివాలయ వీఏవో వరకుమార్ తెలిపారు. పంటవేసిన ప్రతి రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్‌నెంబరుతో పొలం వద్దకు రావాలని వారు కోరారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నపుడు నష్టపరిహారం అందాలంటే పంటనమోదు తప్పనిసరి అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతనాలందక ఇబ్బందులు

జమ్మలమడుగు, ఆగస్టు 25: వేతన బకాయిలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది కోరుతున్నారు.ఐదు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పెడుతున్నా బయటకు చెప్పుకోవడానికి సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టి వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

ఫ్రీ హోల్డ్ జీవోను రద్దు చేయాలి


పోరుమామిళ్ల, ఆగస్టు 25 : అసైన్డ్ భూములపై ఫ్రీ హోల్డ్ జీవో నం.596ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలో పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అసైన్డ్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్‌కు ఫ్రీహోల్డ్ కింద అనుమతించడం 9/77 చట్టానికి విరుద్ధమన్నారు. ఇప్పటికే కలసపాడు, కాశినాయన, బి కోడూరు, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, గోపవరం, పెండ్లిమర్రి గ్రామాల్లో స్థానికేతరుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌కింద రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. వీటిని రద్దు చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

చెక్కభజన కళాకారుడికి స్వర్ణ నంది అవార్డు


సన్మానం అందుకున్న యల్లయ్య

పోరుమామిళ్ల, ఆగస్టు 25 : చెక్కభజన, కోలాటం మాస్టర్ యల్లయ్య తెలంగాణ తెలుగు సంస్కృతీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణనంది అవార్డును అందుకున్నట్లు కళాకారులు తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారని తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం


పుష్పాలంకరణలో వేణుగోపాలస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25: పట్టణానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీకృష్ణాలయంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభయ్యాయి. ఉదయం వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, గోపూజ, కలశస్థాపన చేశారు. సోమవారం వేణుగోపాలస్వామికి 108 కలశాలతో అభిషేకం, గణపతి, అభయ అంజనేయస్వామి, శ్రీకృష్ణ బీజాక్షర మూలమంత్ర హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కోలాటం, రాత్రి 8 గంటలకు హరికథ, 12 గంటలకు చిన్నికృష్ణుడికి ఊంజల్ సేవ చేయనున్నారు. భక్తులు పాల్గొనాలని యాదవ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు.

ఆస్తి కోసం ఘర్షణ - ఇద్దరిపై కేసు నమోదు

కాశినాయన ఆగస్టు25: సిద్దాయపల్లెలో శనివారం రాత్రి ఆస్తికోసం జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాలమేరకు గ్రామానికి చెందిన గొడ్లవీటి ఈశ్వర్‌కు నరసింహులు, నాగయ్య, గురయ్య నడుమ ఆస్తి పంపకాలకు సంబంధించి కొంతకాలంగా వివాదం నడుస్తోంది. శనివారం రాత్రి ఈశ్వరయ్య, షాలీమ్‌రాజు కలిసి నరసింహులు, నాగయ్య, గురయ్యపై దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈశ్వరయ్య, షాలీమ్‌రాజుపై కేసు నమోదు చేసి బాధితులను పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా మన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

పోరుమామిళ్ల, ఆగస్టు 25: అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 52 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం మార్కాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉయ్యాలవాడకు చెందిన ఇద్దరి వద్ద మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. పబ్లిక్ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న పదిమందిపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 25: కబ్జాదారుల నుంచి భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలంటూ ఈ నెల 28న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్‌రెడ్డి పాలనలో భూమాఫియా ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా, శివశంకర్ పాల్గొన్నారు.